క్లుప్తంగా

నారీ యాప్‌పై డ్వాక్రా మహిళలకు అవగాహన



పెడన: డ్వాక్రా సంఘంలో మన డబ్బులు ఎంత ఉన్నాయి.. ఎంత రుణం తీసుకున్నాం.. మనం ఎంత కడుతున్నాం.. అనే విషయాలపై ప్రతి సభ్యురాలికి అవగాహన ఉండాలని డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ అన్నారు. మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో మన డబ్బులు–మన లెక్కలు అనే నారీ యాప్‌పై డ్వాక్రా మహిళలకు బుధవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్జా వెంకట నగేష్, డీపీఎం ఐబీ ఎన్.సత్యభామ, ఏపీఎం ఐబీ సీహెచ్‌వీవీ బాపనయ్య, పెడన మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆర్జా నాగలక్ష్మీ, ఏపీవో శ్రీదేవి, సీసీలు, వీవోఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సామాగ్రి అందజేత

పెడన: పట్టణంలో విధులు నిర్వహిస్తున్న పలువురు పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం సామాగ్రిని అందజేశారు. పుష్‌కార్టులలో పెద్ద బకెట్లు, పలుగులు, పారలను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌మాట్లాడుతూ.. ఇచ్చిన సామాగ్రిని సొంత సామాగ్రిగా జాగ్రత్త పరిచి విధులకు అవసరమైన ప్రాంతంలో సద్వినియోగం అయ్యేలా చూసుకోవాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, పలు పార్టీల నాయకులు కోమట్ల అనిల్, బెజవాడ నాగరాజు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, శానిటరీ మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల ధర్నా

మచిలీపట్నం టౌన్: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు బుధవారం స్థానిక విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు డివిజన్లకు సంబంధించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు ధర్నాకు హాజరయ్యారు.

భోగాదికి ఘనంగా నివాళులు

పర్రచివర(నాగాయలంక): మండలంలోని పర్రచివర గ్రామంలో మంగళవారం మరణించిన సీనియర్ రాజకీయ వేత్త, బీజేపీ కిషాన్ మోర్చా రాష్ట్ర నేత, వరిష్ఠ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త భోగాది వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని బీజేపీ నాయకులు బుధవారం సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు, ఇతర నాయకులు పార్టీ జెండాను భోగాది భౌతికకాయంపై కప్పి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆటల పోటీలు

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. అండర్–14, 17 బాలుర, బాలికల విభాగాల్లో కబడ్డీ, చెస్, హాకీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీలలో గూడూరుతో పాటు మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఆటల పోటీలను గూడూరు హైస్కూలు ప్రధానోపాధ్యాయిని గొరివర్తి విజయకుమారి ప్రారంభించగా మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి పీడీ చిలుకోటి రాజేష్ పోటీలను పర్యవేక్షించారు. పీడీలు శాస్త్రి, అశోక్, శ్రీనివాస్, ముకుంద్‌లు పాల్గొన్నారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని పీడీ వెల్లడించారు.

అనుబంధ రంగాలపై దృష్టి సారించాలి

చల్లపల్లి: వ్యవసాయంతో పాటు రైతులు అనుబంధ రంగాలపై దృష్టి సారించాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి రైతులకు సూచించారు. మండల పరిధిలోని లక్ష్మీపురం–2 సచివాలయంలో బుధవారం సమగ్ర వ్యవసాయ ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించి ఆమె రైతులతో మాట్లాడారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నవీన్, జె.యశ్వంత్ కుమార్, వీవోఏలు యువశ్రీ, నిహారిక, రైతులు పాల్గొన్నారు.

ఘంటసాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సుధారాణి తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. కేవీకే సిబ్బంది, విద్యార్థులతో ఆమె స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మల్లంపల్లి (ఘంటసాల): పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ఘంటసాల సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి తెలిపారు. ఘంటసాల మండలం మల్లంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో జాతీయ పోషకాహార మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. నాగమణి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, తల్లీబిడ్డలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త చిన్నారి, ఉపాధ్యాయులు వంశీకృష్ణ, నవీన్, రమేష్, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. లంకపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఇందిరా పోషకాహారంపై తల్లీబిడ్డలకు అవగాహన కల్పించారు.

వరిసాగు ఎదుగుదలకు ఎలుకల దెబ్బ

- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న రైతులు
- ఎలుకల నివారణకు అందని మందులు
- రైతులే స్వచ్ఛంద చర్యలకు సిద్ధం

కృత్తివెన్ను: ఒక వైపు సాగునీటి కొరత.. మరోవైపు యూరియా కోసం పోరాటం.. ఇప్పుడేమో ఉన్న పంటపై మూషికాల (ఎలుకలు) దాడి వెరసి రైతన్నకు అన్ని వైపులా కష్టాలే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వరిచేలపై ఎలుకల దాడి తీవ్రంగా ఉంది. వీటి బారి నుంచి పంటను రక్షించుకునేందుకు రైతులు చేయని ప్రయత్నాలులేవు. వీటి తీవ్రత ఎంతలా ఉందంటే ఎకరం చేలో కనీసం 20 నుంచి 30 సెంట్ల వరకు పంటను ఎలుకలు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కృత్తివెన్ను మండలంలో దాదాపు 7,200 ఎకరాలలో ఈ ఏడాది రైతాంగం ఖరీఫ్‌ను సాగు చేస్తున్నారు. సాంప్రదాయ నాట్లుతో పాటు వెద పద్ధతిలోనూ రైతులు సాగు చేపట్టారు. ప్రస్తుతం పొలాల్లో ఎలుకలు చేరి పంటను పెద్ద ఎత్తున పాడు చేస్తున్నాయి. వీటి నివారణకు కొందరు రైతులు ఎలుకల మందును పెడుతుండగా.. మరికొందరు సాంప్రదాయ పద్ధతిలో బుట్టలు పెట్టడం, పొగపెట్టి ఎలుకలను పట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.



ఎలుకల నిర్మూలనకు పొగబెడుతున్న కార్మికులు



పొలంలో మందు చల్లుతున్న కార్మికుడు

కనిపించని ప్రభుత్వ చర్యలు..

గతంలో పంట వేసిన కొన్ని రోజులకు అవసరాన్ని గుర్తించి ప్రభుత్వ యంత్రాంగం ప్రతి గ్రామంలో ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ మందును ఉచితంగా రైతులకు అందించేది. అప్పట్లో ఏకంగా అధికారులు రైతుల పొలాల వద్దకు చేరుకుని రైతులందరినీ సమీకరించి వారితో మందు ఎలా కలియబెట్టాలో చేయించి మందును అందించేవారు. కానీ ప్రస్తుతం అటువంటి చర్యలేవీ కనిపించడం లేదు. దీంతో రైతులు చేసేది లేక అందుబాటులో ఉన్న సాంప్రదాయ పద్ధతిలో ఎలుకల నివారణకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల పక్షాన చర్యలు తీసుకుని ఉచిత మందును అందించాలని రైతన్నలు కోరుతున్నారు.

ఉచితంగా మందును పంపిణీ చేస్తాం..



ప్రభుత్వం నుంచి ఎలుకల నివారణకు ఉచితంగా మందు వచ్చింది. త్వరలోనే ఎలుకల నివారణకు మందును ఉచితంగా అందజేస్తాం. రైతులు వ్యక్తిగతంగా కాకుండా సామూహిక పద్ధతిలో ఎలుకల నివారణకు చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

కిరణ్, ఏవో, కృత్తివెన్ను

పగిలిన ప్రధాన తాగునీటి పైపులైను

ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ చంద్రశేఖరరెడ్డి

పెడన: పట్టణ ప్రజలకు తాగునీరు రోజు విడిచి రోజు అందిస్తున్న తరుణంలో బుధవారం తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులను అడిగితే ప్రధాన పైపులైను రాత్రి పగిలిందని.. దీంతో వాటర్ వర్క్స్ నుంచి మెయిన్ ట్యాంకుకు రావాల్సిన నీరు లీకై వృథాగా పోతోందని సమాధానం తెలిపారు. బుధవారం పట్టణంలోని సగం జనాభాకు అందించాల్సిన తాగునీరు సరఫరా లేనట్టేనా అంటే.. ఇదిగో, అదిగో అంటూ అధికారులు కాలం గడిపారు. ఉదయం 11 గంటలకు ఇచ్చేస్తామని కొంత సేపు.. కాదు మధ్యాహ్నం 2 గంటలకు ఇస్తామని.. పనులు అవ్వలేదు సాయంత్రం అంటూ కాలయాపన చేశారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి సమాధానం ఇస్తూ.. పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకుని నడుచుకోవాలని, మరమ్మతులు పూర్తవ్వగానే ఏ సమయంలో అయినా తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

బలమైన సమాజానికి స్త్రీ ఆరోగ్యంగా ఉండాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

బంటుమిల్లి: సమాజాన్ని పెంచి పోషించడంలో స్త్రీ ఆరోగ్యంగా, బలంగా ఉండాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వీకే పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం సంబంధిత గోడ పత్రికను ఎమ్మెల్యే తదితరులు ఆవిష్కరించారు.

8వ రాష్ట్రీయ పోషణమాసం ప్రారంభం..

ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అక్టోబరు 15 వరకు నిర్వహించనున్న మహిళల పోషణమాసాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. గర్భిణులకు నిర్వహించే సీమంతాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాజెక్టు అధికారిణి సముద్రణవేణి కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. మార్కెట్ యార్డు చైర్మన్ తులసీరావు, పీఏసీఎస్ చైర్మన్లు లీలాకృష్ణ, సత్యనారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): విశ్వకర్మ గొప్ప మహనీయులని జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎం.ఫణిదూర్జటి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో బుధవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వకర్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డెప్యూటీ కలెక్టర్ డి.నారాయణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు నెల్సన్‌పాల్ బాబు, వై.లక్ష్మీనారాయణ, ఎంవీ శ్యామ్‌నాథ్, పామర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చల్లపల్లి: మండల విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద విశ్వకర్మ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద విశ్వకర్మ ధ్వజాన్ని ప్రతిష్ఠించి భగవాన్ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు విశ్వకర్మ జయంతి విశిష్టతను వివరించారు. విశ్రాంత ఎంపీడీవో ఓలేటి వెంకటరమణ, ఎన్‌జీవో నాయకులు పూసపాటి బ్రహ్మానందరావు, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి నడకుదురు లీలా బ్రహ్మేంద్ర, జిల్లా మాజీ కోశాధికారి కేసనకుర్తి శరత్‌బాబు, చల్లపల్లి మండల అధ్యక్షులు శామీరుపేట సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏటిమొగ(నాగాయలంక): రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాక పురస్కరించుకుని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలజీ స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి నాగాయలంక మండలంలో బుధవారం పర్యటించారు. సభాస్థలి కోసం ఏటిమొగలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్, నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డు ప్రాంగణాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్‌వీ ఆంజనేయ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, పీఆర్ డీఈఈలు పగడాల సురేష్, ఎం.రమేష్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం అర్బన్: ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని.. మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. స్థానిక చిలకలపూడి పాండురంగ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జి డీఎం హెచ్‌వో డాక్టర్ ఏ.వెంకట్రావు, అధికారులు, వైద్యులు, సిబ్బంది, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తూ ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం రూ.6 లక్షలు విలువ చేసే కార్మికుల సామాగ్రిని కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మునిసిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి కృషి..

మచిలీపట్నం టౌన్: నగర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రూ.67.57 లక్షల వ్యయంతో చేపట్టిన పలు నిర్మాణ పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జైళ్ల డీఐజీ డాక్టర్ వరప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, సబ్ జైల్ సూపరింటెండెంట్ రమేష్, కార్పొరేటర్ అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు గొర్రెపాటి గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమాధానాలు కరువు



చల్లపల్లి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు కరువయ్యాయి. ఎంపీపీ కోట విజయరాధిక అధ్యక్షతన, తహసీల్దార్ డి.వనజాక్షి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు మండలంలో రేషన్ దుకాణాల పనితీరును, రేషన్ పంపిణీ విధానాన్ని వివరిస్తున్న సమయంలో సర్పంచ్ నాగేశ్వరరావు కల్పించుకుని 60 ఏళ్లు నిండిన వారు ఉన్నప్పటికీ రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎంపీపీ కోట విజయరాధిక మాట్లాడుతూ.. ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ, ఎంఈవో–2 పి.వెంకటేశ్వరరావు, మొవ్వ సీడీపీవో ప్రసన్న విశ్వనాద్, గృహనిర్మాణ శాఖ ఏఈ ఆది ధర్వేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరుల పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



యార్లగడ్డ వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమేష్‌బాబు

చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సింహాద్రి రమేష్‌బాబు స్థానిక నేతలతో కలిసి బుధవారం పరామర్శించారు. చిట్టూర్పు, నేతగానిపల్లెలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు(రాజయ్య), బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతున్న రెబ్బా రామచంద్రరావు, కాలు ఆపరేషన్ చేయించుకున్న బత్తుల వెంకటేశ్వరరావులను రమేష్‌బాబు పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అలానే చిట్టూర్పునకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నేతగానిపల్లెకు చెందిన రెబ్బా చక్రవర్తి ఇటీవల మృతి చెందగా వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, యువనేత వేమూరి ప్రవీణ్, సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ పరుచూరి రామకృష్ణ, పాలకేంద్రం ప్రెసిడెంట్ దాసరి చిన కుటుంబరావు, పోలవరపు రమేష్, దాసరి హరిబాబు, బూసి సుబ్రహ్మణ్యం, ముక్కు సురేష్, బత్తుల మురళీకృష్ణ, గుంటూరు కోటేశ్వరరావు, బెజ్జెం నెలబాలుడు, ముక్కు ఆంజనేయ ప్రసాద్, బత్తుల వెంకట్రాది, బెజ్జెం దుష్యంత్, రెబ్బా నాగరాజు, బూసి శ్రీనివాసరావు, బాలు,పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు నీరు అందేలా చర్యలు

సాక్షి ఎఫెక్ట్



రైతులతో మాట్లాడుతున్న డీసీ చైర్మన్, వైస్ చైర్మన్, ఏఈఈలు

కృత్తివెన్ను: శివారు ప్రాంతాలకు సైతం సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మి అన్నారు. డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావు, వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలతో కలిసి ఆమె చినగొల్లపాలెం ఛానల్‌ను పరిశీలించారు. ఇటీవల 'సాగుకు కన్నీరే' శీర్షికన చినగొల్లపాలెం ఛానల్‌పై రైతుల కష్టాలను సాక్షిలో ప్రచురించడంతో అధికారులు బుధవారం ఛానల్‌ను పరిశీలించి నీటి సరఫరా పెంచేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో శివారు ప్రాంతంలో నాట్లు పడేలా నీరిస్తామని ఏఈఈ వివరించారు. ఇదిలా ఉండగా.. అధికారుల ఉదాశీనత కారణంగానే తమకు పూర్తి స్థాయిలో సాగునీరు రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. వరితో పాటు ఆక్వాకు కూడా నీరందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

పెడన: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎంఈవో–2 వై.హరనాథ్ అన్నారు.తోటమూల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బాలబాలికల అండర్ 14, 17 పోటీలు బుధవారం రసవత్తరంగా జరిగాయి. హరనాథ్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ.. క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తిగా ఉండాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతలపాటి నాగేశ్వరావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఈ.దేవి, చేవేంద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండురంగారావు, పెడన మండల వ్యాయామోపాధ్యాయుల ఇన్‌చార్జి గండు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎండీ ఇస్మాయిల్, అంకెం శ్రీనివాసరావు, బసవయ్య, కాగిత నాగలక్ష్మి, ఎన్వీ ఉషశ్రీ, కనకదుర్గ, ప్రియమాధవి తదితరులు ఈ పోటీలకు రిఫ్రీలుగా వ్యవహరించారు.

పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలి

చల్లపల్లి: ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలని పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య అన్నారు. గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమంలో భాగంగా గుంటూరు లామ్‌పామ్‌కు చెందిన విద్యార్థినులు బుధవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజులపాటి అంకమ్మ, పీహెచ్‌సీ వైద్యులు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఘంటసాల సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ అన్నారు. స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని ఘంటసాల పీహెచ్‌సీ డాక్టర్లు వి.ప్రమోద్ కుమార్, టి.వెంకటేశ్వరరావులతో కలిసి సర్పంచ్ బుధవారం ప్రారంభించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, సూపర్‌వైజర్లు ఎం.శివకృష్ణ, కె.పూర్ణచంద్రరావు, పీహెచ్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు ఎన్ అనూషా, సీహెచ్ రేష్మ, పద్మ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక నారాయణరావు నగర్‌లోని అంగన్‌వాడీ–13 కేంద్రంలో సుపోషిత్ భారత్–సక్షం భారత్ కార్యక్రమాన్ని మొవ్వ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు, పిల్లలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి సీడీపీవో ప్రసన్న విశ్వనాథ్ వివరించారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత వైద్య శిబిరం

గూడూరు:మండల పరిధిలోని తుమ్మలపాలెంలో మల్లవోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచి కోడే రేణుకాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వైద్యాధికారి తరుణ్‌శంకర్ బృందం గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఎంపీహెచ్‌ఈవో వీరయ్య, హెచ్‌వీ సరళ, సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి ఎ.మణి, పాల్గొన్నారు.

75వ సారి రక్తదానం



చల్లపల్లి: చల్లపల్లికి చెందిన స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్త, రక్తదాత కస్తూరి విజయ్‌కుమార్ బుధవారం 75వ సారి రక్తదానం చేసి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మచిలీపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గర్భిణికి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు విజయ్‌ను అభినందించారు.

బాధిత కుటుంబానికి చేయూత

గంజివానిపాలెం(మోపిదేవి): మండలంలోని గంజివానిపాలెం దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బూసి దిలీప్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అవనిగడ్డ మాజీ శాసన సభ్యులు సింహాద్రి రమేష్‌బాబు ఆదేశాల మేరకు మండలంలోని పార్టీ నాయకులు మృతుడు దిలీప్ కుటుంబానికి బుధవారం రూ.25 వేలు చేయూతగా అందించారు. మండల పార్టీ కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ కారుమూరి శివనాగరాజు, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షులు బందారు సూరిబాబు, లింగం జగదీష్‌కుమార్, నందిగం అభిషేకరావు తదితరులు పాల్గొన్నారు.

రికమండేషన్లు ఉంటేనే వైద్యం

అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రికమండేషన్లు ఉంటేనే వైద్యం చేస్తున్నారని మాజీ ఎంపీటీసీ అవనిగడ్డ ప్రకాశం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బుధవారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుద్ధప్రసాద్ మహిళల ఆరోగ్యంపై మాట్లాడారు. కార్యక్రమం ముగిసిన తరువాత ప్రకాశం ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసేవలు గురించి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అనారోగ్యానికి గురైన తన తల్లిని మూడు రోజుల క్రితం అవనిగడ్డ వైద్యశాలకు తీసుకు వస్తే రక్తం ఎక్కించాలని.. మచిలీపట్నం తీసుకెళ్లాలని వైద్యులు చెప్పారన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, కొందరు టీడీపీ నాయకులతో సిఫార్సు చేయించాక అవనిగడ్డలోనే ఉంచి వైద్యసేవలు అందించారని చెప్పారు. దీనిపై స్పందించిన బుద్ధప్రసాద్ చిన్న చిన్న కేసులకు ఇక్కడే చికిత్స అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలు వాయిదా

గూడూరు: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జరగాల్సిన అండర్ 14, 17 విభాగం షూటింగ్, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్ పోటీలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ మత్తి అరుణ తెలిపారు. పోటీలు ఎప్పుడు నిర్వహిస్తామో ప్రకటిస్తామన్నారు.

పండ్ల తోటలపై రైతులకు శిక్షణ

నాగాయతిప్ప(మోపిదేవి): ప్రతి రైతు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఉద్యానశాఖ అధికారి ఎస్.రమేష్ తెలిపారు. మండలంలోని నాగాయతిప్ప గ్రామంలో పండ్ల తోటలు, కూరగాయ తోటలు, పసుపు, ఆయిల్ పామ్ పంటల గురించి రైతులకు వివరించి, సబ్సిడీ వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో మోపిదేవలంక గ్రామ సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, గ్రామ ఉద్యాన సహాయకులు బాలాజీ, 3ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధి రాంప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

దుకాణాలు, చెరువుల వేలం వాయిదా

పెడన: పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన 3 చేపల చెరువులు, 23 మున్సిపల్ దుకాణాలకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం పాటను నిర్వహించారు. కాగా ఒక దుకాణానికి మాత్రమే వేలం పాట నిర్వహించి ఆమోదించగా మిగిలిన 22 దుకాణాలు, 3 చేపల చెరువులకు సంబంధించిన వేలం పాటలను వాయిదా వేసినట్లు మున్సిపల్ మేనేజర్ ఎం.రాజా తెలిపారు. మళ్లీ వేలం పాట ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ రాజేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

20న పెడనలో జాబ్ మేళా

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 20వ తేదీ శనివారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడన బి.ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా htt pr:// naipunyam.ap.gov.in/ urer&refirtration లింక్‌నందు తమ వివరాలతో రిజిస్టర్ కావాలని వివరించారు. మరిన్ని వివరాలకు 88977 72488, 99664 89796 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

డివిజన్ స్థాయికి క్రీడాకారులు ఎంపిక

నాగాయలంక: స్థానిక హైస్కూల్ గ్రౌండ్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో 100 మంది విద్యార్థులను బందరులో నిర్వహించే డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మండల క్రీడల ఇన్‌చార్జి, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ గాజుల లక్ష్మీప్రసాద్ బుధవారం తెలిపారు. నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు తమ క్రీడా ప్రతిభ ప్రదర్శించి 44 మంది డివిజన్ పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్.ఎం ఏ.సత్యనారాయణ పేర్కొన్నారు. క్రీడల్లో రాణించిన నాగాయలంక హైస్కూలు బాలబాలికలను ఎస్ఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలామూరుతి, పి.డి గాజుల లక్ష్మీప్రసాద్, స్టాఫ్ అభినందించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

కోడూరు: గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ, పంచాయతీ అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి పారిశుద్ధ్య పనులపై మాట్లాడారు. పంచాయతీ అధికారులు శానిటేషన్ పనులు నిర్వహించడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సుధాప్రవీణ్ తెలిపారు. 2 నెలల నుంచి ఎంపీటీసీలకు జీతాలు ఇవ్వడం లేదని జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం శాఖలవారీగా చేసిన పనులను ప్రజాప్రతినిధులకు వివరించారు. ఎంఈవో టి.వి.ఎం. రామదాసు, వైస్ ఎంపీపీ ముక్కుల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

చెరువు పంచాయితీపై గ్రామ పెద్దలతో సమావేశం



పెడన: మండల పరిధి ఉరివి గ్రామంలోని పంచాయతీ చెరువు పంచాయితీపై రెండు గ్రామలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో పాటు గ్రామపెద్దలతో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పెడన మండలం ఉరివి గ్రామంలో 80 శాతం, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి పరిధిలో 20 శాతం చెరువు ఉండడంతో ఇరు గ్రామాల మధ్య ఈ పంచాయితీ తేలడం లేదని తెలుసుకున్న డీఎల్‌పీవో జి.పద్మ రెండు గ్రామాలకు చెందిన పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామపెద్దలే ఒక నిర్ణయానికి రావాలని ఆమె సూచించారు. సమావేశంలో పెడన ఎంపీడీవో అరుణకుమారి, డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి, బంటుమిల్లి ఈవోపీఆర్డీ శైలాజాకుమారి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

గోగినేనిపాలెం (ఘంటసాల): సాయిదుర్గా క్లీనిక్, ఆప్టికల్స్ వైద్యుల సహకారంతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని గోగినేనిపాలెం సర్పంచ్ కుంపటి సుశీల అన్నారు. బుధవారం నిర్వహించిన ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు 60 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.